
నేటి మ్యాచ్ దక్షిణాఫ్రికా X బంగ్లాదేశ్ న్యూయార్క్ - రా. 8.00



# కింగ్ అల్కారజ్



తొలిసారి ఫ్రెంచ్ ఓపెన్ టైటిల్ కైవసం

ఫైనల్లో జ్వెరెవ్‌పై అద్భుత విజయం

పారిస్: ప్రతిష్ఠాత్మక ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో నయా సంచలనం! ఆరాధ్య ఆటగాడు రఫెల్ నాదల్ ఆదిలోనే నిష్క్రమించిన వేళ తాను ఉన్నానంటూ స్పెయిన్ స్టార్ కార్లోస్ అల్కారజ్ కొత్త చాంపియన్‌గా నిలిచాడు. ఆదివారం జరిగిన పురుషుల సింగిల్స్ ఫైనల్లో అల్కారజ్ 6-3, 2-6, 5-7, 6-1, 6-2తో అలెగ్జాండర్ జ్వెరెవ్(జర్మనీ)పై అద్భుత విజయం సాధించాడు. నాలుగు గంటల 19 నిమిషాల పాటు హోరాహోరీగా సాగిన పోరులో ఈ ఇద్దరు ప్లేయర్లు కొదమసింహాల్లా కొట్లాడారు. తొలి సెట్‌ను 6-3తో కైవసం చేసుకున్న అల్కారజ్‌కు జ్వెరెవ్ దీటైన పోటీనిచ్చాడు. తన అనుభవాన్ని ఉపయోగించుకుంటూ వరుసగా సెట్లు కైవసం చేసుకుని పోరును రసవత్తరంగా మార్చాడు. అయితే ఇక్కడే అల్కారజ్ తనలో పోరాట యోధున్ని తట్టిలేపాడు. పోరాడితే పోయేది ఏమి లేదన్న తరహాలో నాలుగో సెట్‌ను 6-1తో కైవసం చేసుకున్న ఈ స్పెయిన్ బుల్ మళ్లీ వెనుదిరిగి చూసుకోలేదు. అదే దూకుడు కొనసాగిస్తూ జ్వెరెవ్‌కు ఎక్కడా అవకాశమివ్వకుండా నిర్ణయాత్మక ఐదో సెట్‌ను ఖాతాలో వేసుకుని మ్యాచ్‌ను కైవసం చేసుకున్నాడు. చివరి 15 గేముల్లో 12 గేమ్‌లను కాపాడుకున్న అల్కారజ్ విజయం వైపు నిలిచాడు. ఈ క్రమం లో 52 విన్నర్లు కొట్టిన అల్కారజ్ మ్యాచ్‌పై పట్టు నిలుపుకున్నాడు. మరోవైపు జ్వెరెవ్ 41 అనవసర తప్పిదాలతో గెలిచే అవకాశాన్ని చేజార్చుకున్నాడు.


**1** పిన్న వయసు(21 ఏండ్లు)లో మూడు గ్రాండ్‌స్లామ్ టైటిళ్లు గెలిచిన తొలి ప్లేయర్‌గా అల్కారజ్ నిలిచాడు.

**3** కార్లోస్ అల్కారజ్ ఆడిన మూడు గ్రాండ్‌స్లామ్ ఫైనల్స్‌లో విజేతగా నిలిచాడు.

| ప్రైజ్‌మనీ | |
|---|---|
| విజేత: అల్కారజ్ | [21.65 కోట్లు] |
| రన్నరప్: జ్వెరెవ్ | [10.82 కోట్లు] |

## ఆసీస్ ఆల్‌రౌండ్ షో

ఇంగ్లండ్‌కు తప్పని పరాభవం



బార్బడోస్: సమిష్టి ప్రదర్శనతో అదరగొట్టిన ఆస్ట్రేలియా.. డిఫెండింగ్ చాంపియన్ ఇంగ్లండ్‌పై 36 పరుగుల తేడాతో గెలిచి సూపర్-8కు మరింత చేరువైంది. గ్రూప్-బి లో ఇంగ్లండ్‌తో బార్బడోస్ వేదికగా జరిగిన మ్యాచ్‌లో మొదట బ్యాట్‌తో తర్వాత బంతితోనూ చెలరేగిన కంగారూలు బట్లర్ సేనకు చుక్కలు చూపించారు. డేవిడ్ వార్నర్ (39), మార్ష్ (35), హెడ్ (34), స్టోయినిస్ (30) ధాటిగా ఆడటంతో తొలుత బ్యాటింగ్ చేసిన ఆ జట్టు 20 ఓవర్లలో 201/7 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఇంగ్లండ్ బౌలర్లు దారుణంగా విఫలమయ్యారు. లక్ష్యఛేదనలో ఇంగ్లండ్ 20 ఓవర్లకు 165/6కే పరిమితమైంది. ఓపెనర్లు జోస్ బట్లర్ (42), ఫిల్ సాల్ట్ (37) తొలి వికెట్‌కు 7 ఓవర్లలోనే 73 పరుగులు జతచేసినా ఆ తర్వాత వచ్చిన బ్యాటర్లెవరూ వేగంగా ఆడకపోవడంతో ఆ జట్టుకు పరాభవం తప్పలేదు. 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' ఆడమ్ జంపా (2/28), పాట్ కమిన్స్ (2/23) ఇంగ్లీష్ బ్యాటర్లకు అడ్డుకట్ట వేశారు.


## సౌరభ్‌కు రెండు స్వర్ణాలు



నోట్విల్: స్విట్జర్లాండ్‌లోని నోట్విల్ వేదికగా జరుగుతున్న వరల్డ్ పారా అథ్లెట్ గ్రాండ్ ప్రి లో భారత యువ పారా అథ్లెట్ సౌరభ్ శర్మ రెండు స్వర్ణాలతో సత్తా చాటాడు. టీ12 విభాగం (దృష్టి లోపం)లో 155 మీటర్లు, 5000 మీటర్ల రేసులలో పసిడి పరుగులు తీశాడు. హిమాచల్‌ప్రదేశ్‌లోని హమిర్పూర్ జిల్లా రొప ఖయ గ్రామానికి చెందిన సౌరభ్ ప్రస్తుతం డెహ్రాడూన్‌లోని నేషనల్ దృష్టి దివ్యాంగన్ ఎంపవర్‌మెంట్ ఇనిస్టిట్యూట్‌లో విద్యాభ్యాసం చేస్తున్నాడు.

## హోసెన్ పాంచ్ పటాకా

ఉగాండా 39 ఆలౌట్, విండీస్ ఘన విజయం



గయానా: పొట్టి ప్రపంచకప్ టోర్నీకి ఆతిథ్యమిస్తున్న వెస్టిండీస్ వరుసగా రెండో విజయాన్ని నమోదు చేసింది. గ్రూప్-సీలో భాగంగా గయానా వేదికగా ఉగాండాతో జరిగిన మ్యాచ్‌లో 134 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన విండీస్.. జాన్సన్ చార్లెస్ (44), రస్సెల్ (30) రాణించడంతో 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 173 పరుగులు చేసింది. భారీ ఛేదనలో ఉగాండా 12 ఓవర్లలో 39 పరుగులకే ఆలౌట్ అయి భారీ ఓటమిని ఎదుర్కొంది. ఆ జట్టులో జుమ మియాగి (13) ఒక్కడే రెండంకెల స్కోరుచేశాడు. విండీస్ స్పిన్నర్, 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' అకీల్ హోసెన్ (5/11) ఐదు వికెట్ల విజృంభణతో ఉగాండాను కోలుకోనీయలేదు. టీ20 వరల్డ్‌కప్‌లో నెదర్లాండ్స్ (39) తర్వాత ఇది రెండో అత్యల్ప స్కోరు కావడం గమనార్హం.

ప్రతిష్ఠాత్మక టీ20 ప్రపంచకప్‌లో చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌పై భారత్ అద్భుత విజయాల ప్రస్థానం దిగ్విజయంగా కొనసాగుతున్నది. వేదిక ఏదైనా విజయం మనదే అన్న రీతిలో టీమ్‌ఇండియా మువ్వెన్నెల పతాకాన్ని సగర్వంగా రెపరెపలాడించింది. అగ్రరాజ్యం అమెరికా గడ్డపై దాయాదిని మట్టికరిపిస్తూ తమ విజయాల రికార్డును మరో మెట్టు ఎక్కించింది. తొలుత పాక్ పేసర్ల ప్రతాపానికి బ్యాటర్లు కుదేలైన వేళ.. భారత్ 119 పరుగులకే కుప్పకూలింది. రిషబ్ పంత్(42) ఒంటరిపోరాటం జట్టుకు పోరాడే స్కోరు కట్టబెట్టింది. బ్యాటర్లు విఫలమైన చోట మన బౌలర్లు విశ్వరూపం ప్రదర్శించారు. బుమ్రా సూపర్ స్పెల్‌తో జట్టుకు చారిత్రక విజయాన్ని కట్టబెట్టాడు.

# భళిరా.. భారత్

## పాకిస్థాన్‌పై ఉత్కంఠ విజయం • మూడు వికెట్లతో బుమ్రా విజృంభణ..

### బాబర్ సేనకు వరుసగా రెండో ఓటమి • రాణించిన పాక్ బౌలర్లు • భారత్ 119 ఆలౌట్

న్యూయార్క్: ఇది కదా మ్యాచ్ అంటే! టీ20లలో బ్యాటర్ల రొడ్డకొట్టుడు బాదుడు కంటే 'లో స్కోరింగ్ థ్రిల్లర్'లో ఉండే మజాను భారత్-పాక్ మ్యాచ్ మరోసారి అందించింది. చివరి బంతి దాకా ఇరు జట్ల మధ్య నువ్వా నేనా అంటూ దోబూచులాడిన విజయం ఆఖరికి భారత్‌ను వరించింది. ఆదివారం న్యూయార్క్ లోని నసావు స్టేడియం వేదికగా పాకిస్థాన్‌తో జరిగిన మ్యాచ్‌లో రోహిత్ సేన 6 వికెట్ల తేడాతో అత్యద్భుత విజయం అందుకుంది. పాక్ చతుర్ద్వయం నసీమ్ షా (3/21), హరీస్ రవూఫ్ (3/21), మహ్మద్ అమిర్ (2/23), షహీన్ అఫ్రిది (1/29) నిప్పులు చెరగడంతో టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన భారత్.. 19 ఓవర్లలో 119 పరుగులకే ఆలౌట్ అయింది. రిషభ్ పంత్ (31 బంతుల్లో 42, 6 ఫోర్లు) టాప్ స్కోరర్ కాగా అక్షర్ పటేల్ (20) గుడ్డిలో మెల్లలా ఫర్వాలేదనిపించాడు. భారత బ్యాటర్లలో కోహ్లీతో సహా ఏకంగా ఎనిమిది మంది 'సింగిల్ డిజిట్'కే పరిమితమయ్యారు. బ్యాటర్లు విఫలమైనా బౌలర్లు సమిష్టిగా రాణించడంతో పాకిస్థాన్.. నిర్ణీత 20 ఓవర్లలో 113/7కే పరిమితమైంది. రిజ్వాన్ (44 బంతుల్లో 31, 1 ఫోర్, 1 సిక్సర్) రాణించినా మిగిలిన బ్యాటర్లు ఒత్తిడికి చిత్తయ్యారు. భారత విజయంలో కీలక పాత్ర పోషించిన బుమ్రా (3/14)కే 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కింది.



బుమ్రా (3/14)

**వచ్చారు.. వెళ్లారు..**

కీలక మ్యాచ్‌లో భారత బ్యాటింగ్ ఆర్డర్ దారుణాతి దారుణంగా విఫలమైంది. రోహిత్ (13), కోహ్లీ (4), సూర్యకుమార్ (7), శివమ్ దూబె (3), హార్దిక్ పాండ్యా (7), రవీంద్ర జడేజా (0) అలా వచ్చి ఇలా వెళ్లారు. ఇన్నింగ్స్ మూడో బంతినే భారీ సిక్సర్‌గా మలిచిన రోహిత్, ఎదుర్కొన్న తొలి బంతినే బౌండరీగా మలిచిన కోహ్లీ ఆరు బంతుల వ్యవధిలో పెవలియన్ చేరారు. కోహ్లీని నసీమ్ షా ఔట్ చేయగా రోహిత్‌ను షహీన్ పెవిలియన్‌కు పంపాడు. ఈ క్రమంలో భారత్.. పంత్‌కు జోడీగా అక్షర్‌ను పంపింది. ఈ జోడీ పాక్ పేస్ బౌలర్లను అడ్డుకున్నా వేగంగా పరుగులు రాబట్టలేకపోయింది. మూడో వికెట్‌కు 39 పరుగులు జోడించిన ఈ జంటను 8వ ఓవర్లో అమిర్ విడదీయడంతో వికెట్ల పతనం వేగం పుంజుకుంది. ఆ తర్వాత వచ్చినోళ్లలో ఒక్కరు కూడా రెండంకెల స్కోరు కూడా చేయలేకపోయారు. భారత అభిమానులు గంపెడాశలు పెట్టుకున్న సూర్యకు హరీస్ రవూఫ్ చెక్ పెట్టగా దూబె నసీమ్ షాకే రిటర్న్ క్యాచ్ ఇచ్చాడు. అమిర్ 15వ ఓవర్ వరుస బంతుల్లో పంత్, జడేజాను ఔట్ చేశాడు. అర్ష్‌దీప్ (9), సిరాజ్ (7 నాటౌట్) పుణ్యమా అని భారత్ మూడంకెల మార్కును దాటగలిగింది. భారత ఇన్నింగ్స్ మొదటి 10 ఓవర్లలో 3 వికెట్లకు 81 పరుగులు చేస్తే తర్వాతి 9 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 38 పరుగులే చేయగలిగింది.

**రిజ్వాన్ ఒక్కడే..**

స్వల్ప ఛేదనలో పాకిస్థాన్ సైతం తడబడింది. బాబర్ ఆజమ్ (13), ఉస్మాన్ ఖాన్ (13), ఫకర్ జమాన్ (13) విఫలమైనా రిజ్వాన్ పాక్‌ను గెలుపు దిశగా నడిపించాడు. సహచరుల అండతో విజయం దిశగా సాగుతున్న పాక్‌ను బుమ్రా దెబ్బకొట్టాడు. 15వ ఓవర్లో రిజ్వాన్‌ను క్లీన్‌బౌల్డ్ చేసి భారత్‌ను పోటీలోకి తెచ్చాడు. అప్పటికీ ఆజట్టు విజయానికి 4 ఓవర్లలో 36 పరుగులు కావాలి. కానీ తర్వాతి వరుస ఓవర్లలో అక్షర్ 2 పరుగులే ఇవ్వగా.. షాదాబ్ (4)ను ఔట్ చేసిన హార్దిక్ 5 రన్స్ ఇచ్చాడు. 18వ ఓవర్లో సిరాజ్ 9 పరుగులిచ్చాడు. బుమ్రా 19వ ఓవర్లో 3 పరుగులే ఇచ్చి కీలక ఇఫ్తికార్ (5) వికెట్ తీశాడు.

**ఆఖరి ఓవర్ సాగిందిలా..**

చివరి ఓవర్‌లో పాక్ గెలుపునకు 18 పరుగులు కావాల్సి ఉండగా.. అర్ష్‌దీప్ తొలి బంతికి ఇమాద్ వసీం (15)ను ఔట్ చేశాడు. 2,3 బంతుల్లో రెండు పరుగులు రాగా 4,5 బంతుల్లో నసీమ్ షా రెండు బౌండరీలు సాధించినా అప్పటికీ ఆ జట్టు విజయానికి 1 బంతికి 8 పరుగులు అవసరం ఉండటంతో పాక్ ఓటమి ఖరారైంది.

**సంక్షిప్త స్కోర్లు:**

భారత్: 19 ఓవర్లలో 119 ఆలౌట్ (పంత్ 42, అక్షర్ 20, నసీమ్ 3/21, హరీస్ 3/21).పాకిస్థాన్: 20 ఓవర్లలో 113/7 (రిజ్వాన్ 31, ఇమాద్ 15, బుమ్రా 3/14, హార్దిక్ 2/24)

చిత్రం

## ఒక ఆశ మొదలయ్యేది ఆమెతోనే..



'కల్కి 2898' తాజా అప్‌డేట్‌లు ఒక్కొక్కటీ విడుదలవుతుంటే.. సినిమాపై అంచనాలు అంతకంతకూ పెరిగిపోతూ ఉన్నాయి. ఇప్పటికే ఇండియన్ సినిమా దశను, దిశను మార్చే సినిమాగా 'కల్కి 2898' నిలుస్తుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ప్రభాస్, అమితాబ్, కమల్‌హాసన్ పోస్టర్లు ఇప్పటికే విడుదలై అభిమానుల్లో ఆసక్తిని రెట్టింపు చేశాయి. రీసెంట్‌గా ఇందులో ప్రభాస్ నడిపే కారు 'బుజ్జి'ని కూడా ఓ గ్రాండ్ ఈవెంట్‌ని నిర్వహించి మరీ మేకర్స్ రివీల్ చేసిన విషయం తెలిసిందే. ఇప్పుడు తాజాగా దీపికాపదుకోన్ తాలూకా పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేశారు. దీపిక ఎమోషనల్‌గా కనిపిస్తున్న ఈ పోస్టర్‌ని ఎక్స్‌లో పోస్ట్ చేసి, 'ఒక ఆశ మొదలయ్యేది ఆమెతోనే' అంటూ ఓ క్యాప్షన్‌ని పొందుపరిచారు. దీనికితోడు ఈ స్టిల్ నేపథ్యం అంతా విజువల్‌గా గ్రాండ్ ట్రీట్ ఇచ్చేలా కనిపిస్తున్నది. దీంతో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయని చెప్పకతప్పదు. నాగ్‌అశ్విన్ దర్శకత్వంలో ప్రతిష్ఠాత్మక వైజయంతీ మూవీస్ పతాకంపై సి.అశ్వనీదత్ నిర్మిస్తున్న ఈ పాన్ ఇండియా చిత్రానికి సంగీతం: సంతోశ్ నారాయణన్. ఈ నెల 27న సినిమా విడుదల కానుంది.

## లొకేషన్‌లో ఆయన కొత్తగా కనిపిస్తున్నారు



దాదాపుగా పదేళ్ల క్రితం మలయాళంలో 'పట్టం పోలే' సినిమాతో హీరోయిన్ అయ్యింది మాళవిక మోహనన్. ఆ తర్వాత తమిళంలో రజనీకాంత్‌తో 'పేట', విజయ్‌తో 'మాస్టర్'. ధనుష్‌తో 'మారన్' సినిమాల్లో నటించింది. హిందీలో కూడా ఓ సినిమా చేసింది. కానీ.. తెలుగులో మాత్రం సినిమా చేయలేదు. తాజాగా ప్రభాస్ 'రాజాసాబ్'తో తెలుగులో ఛాన్స్ కొట్టేసింది. ఇటీవల చెన్నయ్‌లో జరిగిన ఓ ప్రైవేటు ఈవెంట్‌లో తన తాజా తెలుగు సినిమా గురించి మాట్లాడింది మాళవిక 'నేను సౌత్‌లో అన్ని భాషల్లో చేశాను.. తెలుగులో తప్ప. మంచి పాత్ర దొరికితే తెలుగులో కూడా చేయాలనే కోరిక బలంగా ఉండేది. టాలీవుడ్ ఆఫర్ కోసం ఆశగా ఎదురు చూశా. ఏకంగా పాన్‌వరల్డ్ స్టార్ ప్రభాస్‌తో చేసే ఛాన్సే వచ్చేసింది. 'రాజా సాబ్' ఆఫర్ నాదగ్గరకు వచ్చినప్పుడు నమ్మలేకపోయా. ఇప్పటికీ ఇది కలగానే అనిపిస్తోంది. 'ఈ సినిమాతో నీ స్థాయి పెరిగింది' అని పలువురు అంటుంటే చాలా ఆనందంగా ఉంది. 'రాజా సాబ్' ఓ భిన్నమైన సినిమా. ప్రభాస్ నుంచి ఇలాంటి కథను ఎవరూ ఊహించరు. లొకేషన్‌లో ఆయన కొత్తగా కనిపిస్తున్నారు. మంచి పాత్ర ఇచ్చి ప్రోత్సహించిన దర్శకుడు మారుతిగారికి థ్యాంక్స్' అని తెలిపింది మాళవిక మోహనన్.

## గేమ్‌చేంజర్ అప్పన్న




'గేమ్‌ఛేంజర్' సినిమాలో రామ్‌చరణ్ ద్విపాత్రాభినయం చేస్తున్న విషయం తెలిసిందే. ఇందులో ఆయన తండ్రీకొడుకులుగా నటిస్తున్నట్టు గతంలోనే వార్తలొచ్చాయి. కొడుకు పాత్ర పేరు రామ్ నందన్ అని కూడా రివీల్ అయ్యింది. తాజాగా తండ్రి పాత్ర పేరు 'అప్పన్న' అని తెలుస్తున్నది. ఈ పాత్ర ఫ్లాష్‌బ్యాక్‌లో వస్తుందని సమాచారం. అప్పన్నగా రామ్‌చరణ్ అహార్యం, అభినయం కొత్తగా ఉంటుందట. ఈ కేరక్టర్‌కి సంబంధించిన ఫొటోలు కూడా గతంలో లీక్ అయ్యాయి. మరో విశేషం ఏంటంటే.. ఈ పాత్రకు నత్తి కూడా ఉంటుందట. ఈ సమస్యే కథలో కీలకంగా ఉంటుందట. తండ్రి ఆశయాన్ని కొడుకు ఎలా నిజం చేశాడనేదే ఈ సినిమా ప్రధాన ఇతివృత్తమని తెలుస్తున్నది. ప్రస్తుతం షూటింగ్ రాజమండ్రి పరిసర ప్రాంతాల్లో జరుగుతున్నది. కీలకమైన ఈ షెడ్యూల్‌తో సినిమా షూటింగ్ మొత్తం పూర్తవుతుందట. శంకర్ దర్శకత్వంలో దిల్‌రాజు నిర్మిస్తున్న ఈ చిత్రంలో అంజలి, కైరా అడ్వానీ కథానాయికలు. శ్రీకాంత్, ఎస్‌జేసూర్య, సునీల్ కీలక పాత్రధారులు. తమన్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్న విషయం తెలిసిందే.



## రొమాంటిక్ కామెడీ ఎక్స్‌ప్రెస్

చైతన్యరావ్, హెబ్బా పటేల్ జంటగా నటిస్తున్న సినిమా 'హనీమూన్ ఎక్స్‌ప్రెస్'. బాల రాజశేఖరుని దర్శకుడు. కేకేఆర్, బాలరాజ్ నిర్మాతలు. ఈ నెల 21న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమా టీజర్‌ని అక్కినేని అమల ఆదివారం విడుదల చేశారు. 'టీజర్ ఫన్నీగా రొమాంటిగ్గా ఉంది. ప్రస్తుత పరిస్థితులకు అద్దం పట్టేలా ఉండే కథ ఇది. మా అన్నపూర్ణ ఫిల్మ్ మేకింగ్ కాలేజ్ ఫాకల్టీలు, స్టాఫ్, విద్యార్థులు ఈ సినిమాలో భాగం అవ్వడం చాలా ఆనందంగా ఉంది. సినిమా తప్పకుండా విజయం సాధిస్తుంది.' అని అమల నమ్మకం వెలిబుచ్చారు. రొమాంటిక్ కామెడీ డ్రామాతో రూపొందుతున్న 'హనీమూన్ ఎక్స్‌ప్రెస్' చిత్రం అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకుంటుందని దర్శకుడు తెలిపారు. తనికెళ్లభరణి, సుహాసిని, అరవింద్‌కృష్ణ, అలీ, సురేఖవాణి, రవి వర్మ తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: శిష్ట్లా వి.ఎం.కె, సంగీతం: కల్యాణి మాలిక్, నేపథ్యసంగీతం: ఆర్.పి.పట్నాయక్.



## మైథాలజీ ఫిక్షన్ 'ఏ మాస్టర్ పీస్'

మనీష్ గిలాడ, అరవింద్‌కృష్ణ, జ్యోతి పూర్వాజ్, అషు రెడ్డి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'ఏ మాస్టర్ పీస్'. సుకు పూర్వజ్ దర్శకుడు. బండి ప్రొడక్షన్స్ పతాకంపై శ్రీకాంత్ కండ్రేగుల, మనీష్ గిలాడ నిర్మిస్తున్నారు. శుక్రవారం టీజర్‌ను విడుదల చేశారు. దర్శకుడు మాట్లాడుతూ 'మైథాలజీ, సైన్స్ ఫిక్షన్ కథాంశమిది. సూపర్‌హీరో పాత్రకు మన పురణాల నేపథ్యాన్ని జోడించి ఈ సినిమా తీశాను. భాగవతంలోని జయవిజయుల నేపథ్యంతో హీరో, విలన్ పాత్రను డిజైన్ చేశాం. శివుడిని కల్పిత పాత్రగా చూపించాను. హాలీవుడ్ నిపుణులతో చేసిన వీఎఫ్ఎక్స్ వర్క్ ప్రధానాకర్షణగా నిలుస్తుంది' అన్నారు. క్లైమాక్స్ మినహా చిత్రీకరణ మొత్తం పూర్తయిందని నటుడు, నిర్మాత మనీష్ గిలాడ తెలిపారు. ఈ సినిమాలో 1500లకు పైగా గ్రాఫిక్ షాట్స్ ఉంటాయని మరో నిర్మాత శ్రీకాంత్ కండ్రేగుల పేర్కొన్నారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: శివరామ్ చరణ్, సంగీతం: ఆశీర్వాద్, నిర్మాత: శ్రీకాంత్ కండ్రేగుల, మనీష్ గిలాడ, ప్రజయ్ కామత్, రచన-దర్శకత్వం: సుకు పూర్వజ్.

## తెలంగాణ ఒగ్గు కథే హైలైట్‌గా..

సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టే కథలను ఎంచుకొని.. వాటికి సహజత్వాన్ని జోడించి తెరపై ఆవిష్కరిస్తే.. ఆ తరహా సినిమాలకు జనాలు బ్రహ్మరథం పడుతున్న రోజులివి. ఉదాహరణకు 'బలగం'. ఇప్పుడు అదే కోవలో 'యేవమ్' అనే సినిమా రూపొందుతున్నది. తెలంగాణ ఒగ్గు కథా సాంప్రదాయాన్ని హైలైట్ చేస్తూ.. దర్శకుడు ప్రకాశ్ దంతులూరి 'యేవమ్' సినిమాను తెరకెక్కిస్తున్నారు. కథలో వచ్చే ఓ కీలక సన్నివేశంలో గాఢతను, సారాంశాన్ని ఒగ్గుకథ రూపంలో చెబితే బావుంటుదని ఈ ప్రయత్నం చేశామని, హిందూ సంప్రదాయంలోని గ్రామదేవతల గొప్పతనాన్ని ఈ ఒగ్గు కథలో వివరించడం జరిగిందని దర్శకుడు తెలిపారు. ఒగ్గు కథను ముఖ్య అంశంగా చేర్చిన తొలి కమర్షియల్ సినిమా తమదేనని ఆయన చెప్పారు. ఈ ఒగ్గుకథను రియల్ ఒగ్గుకథ కళాకారులతో చెప్పించడం జరిగిందని, ప్రేక్షకులకు ఓ కొత్త అనుభూతిని పంచే ఈ సినిమా ఈ నెల 14న విడుదల కానుందని ప్రకాశ్ దంతులూరి తెలిపారు. దివి చౌదరి, వశిష్ఠ సింహా, భరత్‌రాజ్, అషురెడ్డి ముఖ్య పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: ఎస్‌వీ విశ్వేశ్వర్, సంగీతం: కీర్తన శేషు, నీలేష్ మందలపు, నిర్మాతలు: నవదీప్, పవన్ గోపరాజు.




## శివకార్తికేయన్‌తో ఢీ..



శివకార్తికేయన్ హీరోగా, ఏఆర్ మురుగదాస్ దర్శకత్వంలో ఓ చిత్రం రూపొందుతోన్న విషయం తెలిసిందే. ఈ పాన్ ఇండియా మూవీ షూటింగ్ శరవేగంగా జరుగుతున్నది. ఈ సినిమాలో పవర్‌ఫుల్ విలన్‌గా బాలీవుడ్ యాక్టర్ విద్యుత్ జమ్వాల్ నటిస్తున్నట్టు ఆదివారం మేకర్స్ ప్రకటించారు. ప్రస్తుతం జరుగుతున్న షెడ్యూల్‌లో విద్యుత్ జమ్వాల్ జాయిన్ అయ్యారు. హై యాక్షన్ ప్యాక్డ్ ఎక్స్‌పీరియన్స్ ఇచ్చే సినిమా ఇదని, శివకార్తికేయన్ కెరీర్‌లోనే ఇది భారీ బడ్జెట్ మూవీ అని మురుగదాస్ అన్నారు. రుక్మిణి వసంత్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: సుదీప్ ఎలామన్, సంగీతం: అనిరుథ్, నిర్మాణం: శ్రీలక్ష్మీ మూవీస్.

## ఆకాశానికి జాబిలి అందం.. భూగోళానికే నా చెలి అందం



హృదయాలను బరువెక్కించే ప్రేమకథలను తీయడంలో బెంచ్‌మార్క్ క్రియేట్ చేసిన దర్శకుడు కె.విజయభాస్కర్. ఆయన గత చిత్రాలైన స్వయంవరం, నువ్వేకావాలి, నువ్వునాకునచ్చావ్, మన్మథుడు, మల్లీశ్వరి.. సినిమాలే అందుకు నిదర్శనాలు. కొంత విరామం తర్వాత మరో ఫీల్‌గుడ్ ప్రేమకథతో విజయభాస్కర్ రానున్నారు. సినిమా పేరు 'ఉషాపరిణయం'. 'లవ్ ఈజ్ బ్యూటిఫుల్' ఉపశీర్షిక. కె.విజయభాస్కర్ స్వీయదర్శకత్వంలో నిర్మిస్తున్న ఈ చిత్రం ద్వారా విజయభాస్కర్ తనయుడు శ్రీకమల్ హీరోగా పరిచయం అవుతున్నాడు. తెలుగమ్మాయి తాన్వీ ఆకాంక్ష కథానాయిక. చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ సినిమా నిర్మాణానంతర కార్యక్రమాలు జరుపుకుంటున్నది. ప్రమోషన్‌లో భాగంగా ఈ సినిమాలోని తొలిపాటను ఆదివారం విడుదల చేశారు. 'ఆకాశానికి జాబిలి అందం.. భూగోళానికే నా చెలి అందం' అంటూ సాగే ఈ గీతాన్ని అలరాజు సాహిత్యం అందించగా, ఆర్.ఆర్.ధ్రువన్ స్వరపరిచి ఆలపించారు. ప్రేమకు తానిచ్చే నిర్వచనం ఈ సినిమా అని, అన్ని ఉద్వేగాలూ కలగలిసిన ఈ సంగీతభరిత ప్రేమకథ.. ప్రేమికులకు విందుభోజనంలా ఉంటుందని విజయభాస్కర్ తెలిపారు. సూర్య, రవి, శివతేజ, అలీ, వెన్నెలకిశోర్, ఆమని, సుధ తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: సతీశ్ ముత్యాల.